క్లుప్తంగా

నేడు ఆహ్వాన శోభాయాత్ర

కాగజ్‌నగర్‌రూరల్: అయోధ్య గర్భగుడి నుంచి పరమ పవిత్రమైన పూజిత అక్షింతలు కాగజ్‌నగర్ పట్టణానికి చేరనున్న సందర్భంగా శనివారం ఆహ్వాన శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు భజరంగ్‌దళ్ సభ్యులు తెలిపారు. త్రినేత్ర శివాలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమై పట్టణ పురవీధుల గుండా ఎస్‌బీఐ సమీపంలోని హనుమాన్ మందిరం వరకు కొనసాగుతుందన్నారు. శోభాయాత్రలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఆరెగూడలో పశు వైద్యశిబిరం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని మోసం గ్రామపంచాయతీలోని ఆరెగూడ గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కృత్రిమ గర్భధారణ, గర్భకోశ సమస్యలు గుర్తించి చికిత్స అందించారు. 65 గేదెలు, 72 ఆవులకు గర్భకోశ చికిత్సలు, 110 ఎద్దులకు, 72 మేకలకు సాధారణ చికిత్సలు నిర్వహించారు. శిబిరంలో పశు వైద్యాధికారి విజయ్, రాస్పెల్లి పశువైద్యశాల సహాయకుడు రాజ్‌కుమార్, జిల్లా గోపాల మిత్రుల సూపర్‌వైజర్ రమేశ్, జమీర్, రమేశ్ బాబు, భాస్కర్, నాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే హరీశ్‌బాబును సన్మానిస్తున్న సభ్యులు

కౌటాల: హైదరాబాద్ నగరంలోని కొంపల్లిలో శుక్రవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైనందుకు ఎమ్మెల్యేను వైద్యుల సంఘం సభ్యులు సన్మానించారు.

రోగులకు బెడ్‌షీట్లు కరువు

నార్నూర్: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నా.. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం వసతులు కల్పించడం లేదు. దీంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. ఇంటి నుంచే బెడ్ షీట్లు (దుప్పట్లు) తీసుకోని వస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి ఆసుపత్రిలో వసతులు కల్పించాలని రోగులు కోరుతున్నారు.

'బడి బయట పిల్లలను గుర్తించాలి'

లింగాపూర్: మండలంలోని జాముల్‌ధర గ్రామపంచాయతీలో బడి బయట పిల్లల గుర్తింపు సర్వే ఈ నెల 11 నుంచి జనవరి 10 వరకు నిర్వహించనున్నట్లు సీఆర్పీ జాదవ్ సంజీవ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాముల్‌ధర గ్రామంలో ఇద్దరు బడి బయట పిల్లలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

కొనసాగుతున్న బడి బయట పిల్లల సర్వే

తాండూర్: మండలంలో బడి బయట పిల్లల సర్వే కొనసాగుతోంది. ఈనెల 11న బడి బయట ఉన్న పిల్లలను గుర్తించడానికి సర్వేను ప్రారంభించారు. ఇందులో భాగంగా కిష్టంపేటలో శుక్రవారం సీఆర్పీలు ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. మండల వ్యాప్తంగా సర్వే చేస్తున్నట్లు ఎంఈవో ప్రభాకర్ తెలిపారు. తల్లిదండ్రులు బడీడు పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు. సీఆర్పీలు తిరుపతి ,నాగరాజు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలోని మసాలా ఒర్రె వద్ద గుర్తుతెలియని మహిళ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. మతిస్థిమితం లేని మహిళ పట్టాలపై నిలబడి ఉండడంతో కరీంనగర్–సిర్పూర్ (టి) ప్యాసింజర్ రైలు ఢీకొట్టడంతో మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తాంసి: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ లక్ష్మి శుక్రవారం పరిశీలించారు. పోలింగ్‌స్టేషన్‌లో వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున అన్ని వసతులతో సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఆర్‌ఐ మహేందర్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, సర్వేయర్ మనోజ్ రికార్డ్ అసిస్టెంట్ అడెల్లు, పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఇచ్చోడ: విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహాత్మా జోతిబాపూలే పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చలి తీవ్రత ఉన్నందున వెచ్చని దుస్తులు ధరించాలన్నారు.

నిర్మించారు.. వదిలేశారు!

- నిర్వహణ లేని రైతువేదికలు
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- ఇబ్బందులు పడుతున్న ఏఈవోలు



కెస్లాగూడలోని రైతువేదిక

కెరమెరి: రైతుల సంక్షేమం కోసం నిర్మించిన రైతువేదికలను నిధులు కొరత వెంటాడుతుంది. రైతువేదికల నిర్వహణ కొరవడి రైతులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. 15 నెలలుగా నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వహణ ఇబ్బందిగా మారింది. రైతులకు సాగులో సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందించేందుకు, రైతులకు అధికారులు నిత్యం అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం క్లస్టర్ స్థాయిలో 2021లో రైతువేదికలు నిర్మించింది. అధికారులు రైతులతో అడపాదడపా రైతువేదికల్లో సమావేశాలు సైతం నిర్వహిస్తున్నారు. జిల్లాలో 70 క్లస్టర్లలో 70 రైతువేదికల నిర్మాణం చేపట్టారు. ఒక్కో నిర్మాణానికి రూ.22 లక్షల చొప్పున రూ.15.40 కోట్ల నిధులు వెచ్చించారు. అయితే వీటి నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ప్రారంభంలోనే హడావిడి..

ప్రారంభంలో రైతువేదికల నిర్వహణకు ప్రభుత్వం నెలకు రూ.9 వేల చొప్పున నిధులు విడుదల చేసింది. దీంతో నిర్వహణ సవ్యంగా సాగింది. అయితే ఆ తర్వాత నుంచి నిధులు మంజూరు చేయడం లేదు. దాదాపు 15 నెలలుగా నిధులు విడుదల చేయకపోవడంతో రైతువేదికల నిర్వహణ చేపట్టడం లేదు. వాటిని శుభ్రం చేసేందుకు తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసినా ప్రస్తుతం వారు కూడా పని చేయడం లేదు. గ్రామ రైతుబంధు సమితి అధ్యక్షులు, రైతులు, ఏఈవోలు తరుచుగా సందర్శనకు వెళ్లే అధికారులు సమావేశాల కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనువుగా లేకుండా రైతువేదికలు తయారయ్యాయి.

అసాంఘిక కార్యకలాపాలకు..

కొన్ని చోట్ల రైతువేదికలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని విమర్శలు ఉన్నాయి. రైతువేదికలు అనేక గ్రామాల్లో గ్రామాలకు దూరంగా ఉండడంతో రక్షణ లేకుండా పోకిరీలు, మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. నిత్యం వాటిని శుభ్రం చేయడం, మంచి నీటి సౌకర్యం కల్పించడం, ఇతరత్రా పనులు క్షేత్రస్థాయిలో అధికారులకు తలకు మించిన భారంగా మారింది. రైతువేదికలను నిధులను సత్వరమే విడుదల చేసి త్వరగా వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

ఏఈవోలు పర్యవేక్షిస్తున్నారు..



రైతువేదికలు అన్ని చోట్ల వినియోగంలోకి తీసుకొచ్చాం. ఏఈవోలు అవసరమున్నప్పుడు వెళ్లి పర్యవేక్షిస్తున్నారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. సాగులో సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది

– శ్రీనివాస్, డీఏవో

ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ

పెంచికల్‌పేట్: మండలంలోని ఆగర్‌గూడ, ఎల్లూర్ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సేవలను శుక్రవారం ఆర్టీసీ అధికారులు పునరుద్ధించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేదని తెలిపారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు చొరవతో మళ్లీ బస్సు సౌకర్యం కలిగిందన్నారు. ఈసందర్భంగా ఆర్టీసీ అధికారులకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. బస్సు సేవలను అందరు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గ్రామస్తులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



బస్సుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి



బాపుజీ (ఫైల్)

కౌటాల: కౌటాల మాజీ ఎంపీటీసీ రత్నం బాపుజీ(56) శుక్రవారం గుండె పోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బాపుజీ కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఛాతీలో నొప్పి రావడంతో సిర్పూర్ (టి)లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి భార్య మంగళ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలి

కౌటాల: ప్రతి ఒక్కరూ సేవ కార్యక్రమాలు చేపట్టాలని ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గిన్నెలహెట్టి గ్రామంలో వృద్ధులకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో చలి తీవ్రత పెరిగిందని, ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. సేవా కార్యక్రమాలతో మంచి గుర్తింపు వస్తుందని, అందరూ సేవాగుణం కలిగి ఉండాలని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రజలు మద్యానికి బానిస కావొద్దని సూచించారు. కార్యక్రమంలో ఫాదర్ థామస్ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్సై మధుకర్

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ తహసీల్దార్‌గా కిరణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కౌటాలలో పనిచేసిన కిరణ్‌కుమార్ ఇక్కడికి బదిలీ కాగా, ఇక్కడ విధులు నిర్వహించిన శ్రీపాల్‌రెడ్డి కౌటాలకు బదిలీ అయ్యారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం మండలంలో ఈదులవాడ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల అన్ని సౌకర్యాలతో కూడిన విద్య అందించాలన్నారు. అనంతరం హెల్త్ సెంటర్ సందర్శించి గ్రామస్తులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ భీమేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న కాలనీవాసులు

కాగజ్‌నగర్‌రూరల్: పెద్దవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను శనివారం మారుతినగర్, సీబాబు కాలనీలవాసులు అడ్డుకున్నారు. ట్రాక్టర్లు కాలనీల మీదుగా వెళ్తుండడంతో దుమ్మూధూళీ పడుతుందని దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆరోపిస్తూ ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దుమ్ము ధూళి లేవకుండా చర్యలు తీసుకుంటామని ట్రాక్టర్ యజమానులు హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.



ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న కాలనీవాసులు

నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. ఈ సమావేశానికి నవోదయ విద్యాలయ పూర్వ విద్యార్థులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

ఆసిఫాబాద్: తెలంగాణ మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమకారుల సంఘం నాయకుడు రూప్‌నర్ రమేశ్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రగతి భవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సాధనలో ఉద్యమకారుల పాత్ర అత్యంత కీలకమన్నారు. తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని, ప్రతీ నెల రూ.25 వేల గౌరవ భృతి చెల్లించాలని కోరారు. ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. కొంద్ర రాజేశ్వర్, రేగుంట కేశవరావు, మారుతి పటేల్, సూత్రాల రవి, సుప్రజ తదితరులు ఉన్నారు.



జ్యోతిబాపూలే ప్రజాభవన్ వద్ద జిల్లా ఉద్యమకారులు

వరిగడ్డి దగ్ధం

చింతలమానెపల్లి: మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన డోకే ప్రకాశ్ వరి పొలం నుంచి వరి గడ్డిని ట్రాక్టర్‌తో ఇంటికి తీసుకొస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ తీగలకు తగిలి పూర్తిగా వరి గడ్డి దగ్ధమైంది.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

వాంకిడి: మండలంలోని పలువురు శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. మండలంలోని చౌపన్‌గూడ సర్పంచ్ సీడం అన్నిగా, కొలాం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీంరావు వివిధ గ్రామాల పటేల్లు, వివిధ సంఘాల నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. విశ్వప్రసాద్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కెరమెరి మాజీ జెడ్పీటీసీ ఆత్రం లక్ష్మణ్, మాజీ ఎంపీపీ బదావత్ ఇందురావ్, పార్టీ మండల అధ్యక్షుడు మసాదె చరణ్, గుర్నులె నారాయణ, లావుడ్య రమేశ్, చిత్తారి సాగర్, కుసుంరావ్, దేవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్

అభివృద్ధికి అందరి సహకారం అవసరం

రెబ్బెన: గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రజాప్రతినిధులతో పాటు ప్రజల సహకారం ఎంతో కీలకమని నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్ అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో సాధారణ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీకి మంజూరైన నిధులు, జమ ఖర్చుల వివరాలను వార్డు సభ్యులకు తెలియజేశారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గ్రామంలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై ఆరా తీసి పలు తీర్మానాలు చేశారు. ఉప సర్పంచ్ అశోక్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



వార్డుసభ్యులతో చర్చిస్తున్న సర్పంచ్ సోమశేఖర్

'టీబీజీకేఎస్‌తోనే హక్కులు సాధ్యం'

రెబ్బెన: కేసీఆర్ నాయకత్వంలోని టీబీజీకేఎస్‌తోనే సింగరేణి కార్మికుల హక్కులు సాధ్యమవుతాయని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘంతోనే కార్మికులకు ఎనలేని హక్కులు దక్కాయన్నారు. కార్మిక హక్కులను యాజమాన్యం వద్ద తాకట్టు పెట్టే జాతీయ సంఘాల మోసపూరిత వాగ్దానాలు, మాటలు నమ్మి కార్మికులు మోసపోవద్దన్నారు. టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు మంగీలాల్, ఏరియా మాజీ ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, జీఎం కమిటీ సభ్యులు రవీందర్, వెంకటేశం, ఏరియా నాయకులు సంపత్, వీరస్వామి, సదానందం, మహేందర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు

'కార్మికులకు తీవ్ర అన్యాయం'

రెబ్బెన: కార్మికులకు మెరుగైన హక్కులు కల్పించాల్సిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మిక హక్కులను పోగొట్టి కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేశాయని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి రాజమౌళి అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యంతో పాటు అవినీతి, కుంభకోణాలు పెరిగిపోయాయన్నారు. బెల్లంపల్లిలో ఉన్న సింగరేణి క్వాటర్లను కార్మికులకు కాకుండా బయట వ్యక్తులకు, ఇతర మండలాల వ్యక్తులకు, బీఆర్‌ఎస్ నాయకులు పైరవీలతో ఇప్పించారని ఆరోపించారు. ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, ఏరియా కార్యదర్శులు మాధవకృష్ణ, సంజీవరెడ్డి, సూర్యనారాయణ, మాజీ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ చంద్రకుమార్, ఫిట్ నాయకులు, సెక్రటరీలు రవికుమార్, అనంతకుమార్, కోటేశ్వర్‌రావు, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిద్దంశెట్టి రాజమౌళి

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా పోలీసు హెడ్ క్వాటర్స్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన బి.వినోద్‌కుమార్ జూన్‌లో గుండెపోటుతో మరణించగా అతడి కుటుంబానికి శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు రూ.8,60,000 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న క్రమంలో వినోద్ గుండెపోటుతో మరణించాడని, దీంతో అతడి సతీమణి సునీతకు చెక్కు అందించినట్లు తెలిపారు. పోలీసు శాఖ నుంచి కుటుంబానికి రావాల్సిన రూ.8లక్షలు, కార్పస్ ఫండ్ రూ.50వేలు, విడో ఫండ్ రూ.10వేలు మొత్తం రూ.8లక్షల60వేలు అందజేసినట్లు పేర్కొన్నారు. తదుపరి వారి కుటుంబానికి రావాల్సిన మరిన్ని బెనిఫిట్స్‌ను త్వరలో అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సంఘం అధ్యక్షుడు విజయ శంకర్‌రెడ్డి, డీపీవోటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావ్

ఒకరి రిమాండ్

కౌటాల: దొంగతనం చేసి పట్టుబడిన వ్యక్తిని శుక్రవారం రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన రిమాండ్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 12న కౌటాల జగదాంబ ఫంక్షన్ హాల్‌లోని రూ.29వేల విలువ గల సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు ఫంక్షన్ హాల్ యజమాని శ్రీనివాస్ ఈ నెల 13న ఫిర్యాదు చేశాడు. శుక్రవారం స్థానిక తాటిపెల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా నదీమాబాద్ గ్రామానికి చెందిన అల్లూరి శోభన్ అనే వ్యక్తి ఎడ్లబండిపై గంజులు, ఇతర సామగ్రిని తరలిస్తుండగా అనుమానంతో అతడిని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. శోభన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.



రిమాండ్ చూపిస్తున్న ఎస్సై

బస్సు సౌకర్యం కల్పించరూ..!

- మహారాష్ట్రకు వెళ్లడానికి ప్రయాణికుల తిప్పలు
- రూట్ సర్వే పూర్తి చేసిన ఆర్టీసీ అధికారులు
- ఇప్పటికీ ప్రారంభం కాని బస్సు సేవలు

సిర్పూర్(టి): మండల కేంద్రం నుంచి మహారాష్ట్రకు బస్సు సౌకర్యం కల్పించాలని మండల ప్రజలతో పాటు నియోజకవర్గంలోని కౌటాల, బెజ్జూర్, కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్, దహెగాం, చింతలమానెపల్లి మండలాల వాసులు కోరుతున్నారు. సిర్పూర్(టి) మండలం సరిహద్దుగా మహారాష్ట్ర గ్రామాలతో పాటు మహారాష్ట్రలోని వీరూర్, రాజూరా, బల్లార్షా, చంద్రపూర్, గోండ్‌పిప్రి, అహెరి పట్టణాలకు ప్రధాన రహదారులు ఉన్నాయి. అయితే ఈ మార్గంలో బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు, మహారాష్ట్రకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం రాకపోకలు..

మహారాష్ట్రలో ఉన్న పట్టణాలకు వివిధ పనుల కోసం ప్రతిరోజు నియోజకవర్గ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో అధిక చార్జీలు చెల్లించి ప్రయాణాలు సాగిస్తున్నారు. దీంతో ప్రయాణ భారంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టీసీ అధికారులు మహారాష్ట్ర గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



వెంకట్రావ్‌పేట్ -పోడ్సా అంతర్రాష్ట్ర రోడ్డు

పూర్తయిన ఆర్టీసీ అధికారుల సర్వే..

సిర్పూర్(టి) మండల కేంద్రం నుంచి మహారాష్ట్రలోని వివిధ పట్టణాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో అధికారులు పలు దఫాలు రూట్ సర్వే నిర్వహించారు. కానీ ఇప్పటికీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించలేదు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి సిర్పూర్(టి) నుంచి మహారాష్ట్ర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



మండల కేంద్రం మీదుగా సరిహద్దున ఉన్న మహారాష్ట్ర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి. ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ప్రైవేట్ వాహనాల్లో అధిక చార్జీలు చెల్లించి ఆర్థికంగా నష్టపోతున్నాం.

– సంజీవ్‌కుమార్, సిర్పూర్ (టి)

ఇబ్బందులు పడుతున్నాం..



మండల కేంద్రం నుంచి మహారాష్ట్రకు బస్సు సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు సర్వేలు చేసి హామీ ఇచ్చినా ఇప్పటికీ బస్సు సేవలు ప్రారంభించలేదు.

– నులిగొండ రాజశేఖర్, సిర్పూర్ (టి)

వందశాతం ఈ-కేవైసీ పూర్తి చేయాలి

గుడిహత్నూర్: మండలంలోని రేషన్ డీలర్లు ఈ-కేవైసీని వందశాతం పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. రేషను కార్డులోని ప్రతి సభ్యుడిని అప్‌డేట్ చేయాలని సూచించారు. ఈక్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.